సాక్షి పెద్దపల్లి

సోమవారం । 11 । మార్చి । 2024



మల్లన్నకు మొక్కులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి పట్నాలు వేసి పూజలు చేశారు.



ఆత్మీయ స్వర్ణోత్సవం

గోదావరిఖనిటౌన్: నెహ్రూ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్ 1972–73 టెన్త్ విద్యార్థులు ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
34.6/24.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు చర్యలు



పోలీసుస్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

మంథని/రామగిరి: నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంథని, రామగిరి పోలీస్‌స్టేషన్లను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏసీపీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం సీపీ మాట్లాడారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, హిస్టరీ షీటర్లను బైండోవర్ చేయాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో తరచూ పర్యటించాలని చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించాలని సూచించారు. మంథని, రామగిరి ఎస్సైలు వెంకటకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే సింగరేణి అభివృద్ధి



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఐఎన్‌టీయూసీతోనే సింగరేణి అభివృద్ధి సాధ్యమని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మూడు నెల్లలోనే కార్మికుల కోసం తాడిచెర్ల–2, ఆర్‌కే–6 బొగ్గు గనులు ప్రారంభించిందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఒక్క కొత్త బొగ్గుగని కూడా తవ్వించలేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కొత్తబొగ్గు గనులు ప్రారంభించి సుమారు 17వేల మందికి పైగా యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆయన అన్నారు. నాయకులు ధర్మపురి, దాసు, సత్యనారాయణరెడ్డి, శంకర్ నాయక్, కృష్ణ, మార్కండేయ, రాజయ్య, రవీందర్, సాగర్, శ్రీనివాస్, అల్లాఉద్దీన్, సత్తయ్య, శ్రీనివాస్, ఓదెలు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి టామ్‌కామ్ ద్వారా సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సికింద్రాబాద్ ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోందని వివరించారు. 21 నుంచి 38 సంవత్సరాల వయసు కలిగి, బీఎస్సీ అర్హత గల నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు నర్సింగ్ కెరీర్ అవకాశాల కోసం ఈ అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. ఫ్రెషర్లు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జర్మన్ భాషపై నివాస శిక్షణ, జర్మనీలో పనిచేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు టామ్‌కామ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తారని తెలిపారు. ఆసక్తి గల నర్సింగ్ అభ్యర్థులు సెల్ నంబర్ 99088 30438, 63022 92450, 89190 47600, 79012 90580లో సంప్రదించాలని కోరారు.

'ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడం విచారకరం'

మంథని: మంథనిలోని ప్రధాన చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ వేదాలు, ఉన్నత విద్యావంతులకు మంథని నిలయమని, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడం విచారకరమన్నారు. మంథని పట్టణంలో మారుమూల ఏరియాలో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులకు అందుబాటులో ఉండేలా మున్సిపాలిటీ షటర్లలో ఏదో ఒకచోట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు బూడిద గణేశ్, బెజ్జంకి దిగంబర్, బూడిద తిరుపతి, మంథని లింగయ్య, కొయ్యల మొండి, రవి అడుచర్ల సమ్మయ్య, కాసిపేట పోషం, తోటపల్లి శంకర్ అద్దూరి, సమ్మయ్య, బానేష్, తోటపల్లి వెంకటస్వామి, తోటపల్లి దుర్గయ్య పాల్గొన్నారు.

తరుముతున్న ఆహారం కొరత!

- ఒత్తిడికి లోనవుతున్న కుక్కలు
- డీ హైడ్రేషన్‌కు గురవుతున్న వైనం
- ఫలితంగా ప్రజలపై నిత్యం దాడులు
- తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలవుతున్న జనాలు
- వేసవిలో దాడులు పెరుగుతాయని సర్వత్రా ఆందోళన



తీవ్రంగా గాయపడిన ఈ బాలిక పేరు మేకల అనుశ్రీ. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం స్వగ్రామం. గత నెల 21న రాత్రి తన ఇంట్లో ఆడుకుంటోంది. వీధికుక్కలు లోనికి చొరబడి చిన్నారిపై దాడిచేశాయి. భయంతో కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు రావడంతో కుక్కలు పారిపోయాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కుక్క కనిపిస్తే చాలు.. బాలిక ఇప్పటికీ భయంతో వణికిపోతోంది.



రామగుండంలో కుక్కకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తున్న వైద్యులు(ఫైల్)

- గోదావరిఖని జీజీహెచ్‌లో ఏఆర్‌వీ టీకా నిల్వలు 125 వరకు, రేబిస్ ఇమ్యూనోగ్లోబిన్(రిగ్) 95 వరకు ఉన్నాయని అధికారులు తెలిపారు.
- రామగుండం నగరపాలక సంస్థలో గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు కుక్కకాటుకు గురైనవారు 1,781 మంది ఉండగా, ఇందులో 1,308 మందికి ఏఆర్‌వీ టీకా, 473 మందికి రిగ్ వ్యాక్సిన్ ఇచ్చారు.



నిరుపయోగంగా శునకాల ఆపరేషన్ థియేటర్

రామగుండం బల్దియాలో కుక్కల నియంత్రణకు వెచ్చిస్తున్న నిధులు(రూ.లక్షల్లో)

సంవత్సరం	ఖర్చు
2020–21	4
2021–22	10
2022–23	8
2023–24	0
2024–25(అంచనా)	15

చర్యలు తీసుకుంటాం



కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. మల్కాపూర్‌లోని శునకాల ఆపరేషన్ థియేటర్ పరిశీలించా. కరీంనగర్‌లో ఇప్పటికే ఈ ప్రక్రియ నడుస్తోంది. వారితోనే ఇక్కడ కూడా కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. అలాగే కుక్కలు డీహైడ్రేషన్ కాకుండా అవసరమైన చోట్ల నీటి తొట్లు ఏర్పాటు చేస్తాం.

– సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, రామగుండం బల్దియా

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధులు, రోడ్లపై గుంపులుగా తిరుగుతూ కాలినడకన వెళ్తున్న వారిని, ద్విచక్ర వాహనదారులను వెంటపడి మరీ కరుస్తున్నాయి. వాటి దాడిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గాయాలపాలయ్యారు.

ఆకలి తీర్చుకునేందుకేనా?

గతంలో వీధికుక్కలు ఎవరిపైనా దాడులు చేసేవి కావని, ప్రస్తుతం గ్రామాలు, మున్సిపాలిటీల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుండడంతో వాటికి ఆహారం లభించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణతోనూ రోడ్డు పక్కన అన్నం, ఇతర ఆహార పదార్థాలు పడేయడం తగ్గిపోతోంది. దీంతో కుక్కలకు ఆహారం లభించడంలేదని, దాహం తీర్చుకోవడానికి నీళ్లు దొరకడం లేదని, తద్వారా డీహైడ్రేషన్, తీవ్ర ఒత్తిడికి గురవుతూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయని జంతుప్రేమికులు వివరిస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం కు.ని. ఆపరేషన్లు..

రామగుండం నగరపాలక సంస్థ అధికారులు వీధికుక్కల నియంత్రణకు 2020లో తొలిసారి సంతాన ఉత్పత్తి నిరోధానికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు(కు.ని.) చేయించారు. యాంటీ రేబిస్ టీకాలు ఇవ్వడంతోపాటు గోదావరిఖని మల్కాపూర్ సమీపంలోని స్లాటర్‌హౌస్‌లోని రెండు గదుల్లో సుమారు రూ.7లక్షలు వెచ్చించి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఏ–సంస్థతో తొలివిడతలో వెయ్యి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయడంతోపాటు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించారు. ఇందుకోసం భారీగానే నిధులు వెచ్చించారు. ఇప్పుడు మళ్లీ కుక్కల సంతానం భారీగా పెరిగింది. వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. ఆపరేషన్ థియేటర్లు, కుక్కల కోసం ఏర్పాటు చేసిన బోన్లు నిరుపయోగంగా మారాయి.

కుక్కల బారినుంచి ఇలా తప్పించుకోండి..

- కుక్క దగ్గరికి వస్తే కదల వద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. కళ్లలోకి తదేకంగా చూడరాదు. కుక్క పిల్లల దగ్గరికి వెళ్లరాదు.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు ఇబ్బంది పెట్టరాదు.
- కుక్క దాడి చేసేటప్పుడు ముఖాన్ని పంచె లేదా తువ్వాలుతో కప్పుకోవాలి. ఏమీ లేకపోతే చొక్కాను పైకి జరుపుకోవాలి.
- కుక్క చెంతకు వస్తున్నప్పుడు నేలవైపు చూస్తూ నెమ్మదిగా దూరంగా నడిచి వెళ్లాలి.

కుక్క కరిస్తే ఇలా చేయాలి..

గతంలో కుక్కకాటుకు గురైతే బొడ్డు చుట్టూ 16 ఇంజక్షన్లు వేసేవారు. దీంతో బాధితులు ఇబ్బంది పడేవాళ్లు. ఇప్పుడా పద్ధతి మారింది. కుక్కకాటుకు గురైన వ్యక్తి ఐదుసార్లు యాంటి రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. గాయమై రక్తస్రావం జరిగితే.. వ్యాక్సిన్‌తోపాటు కరిచినచోట ఇమ్యూనోగ్లోబిలిన్స్ ఇంజక్షన్ తీసుకోవాలి.

బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలే కీలకం

- మౌత్‌టాక్‌తోనే విజయావకాశాలు
- బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): 'ఇవి ఎమ్మెల్యే స్థాయి ఎన్నికలు కావు.. అన్ని గ్రామాల్లో ప్రచారం చేయడం సాధ్యం కాదు.. పార్లమెంట్ పరిధిలో ఏడు శాసన సభ స్థానాలు ఉన్నాయి.. కేవలం మండలస్థాయిలో ఒకట్రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది.. కార్యకర్తలు గ్రామాలకే పరిమితం కాకుండా ఎక్కడ బంధువులు ఉన్నా.. స్నేహితులు ఉన్నా.. వారికి ఫోన్ చేయండి.. ఎమ్మెల్యేగా, చీఫ్‌విప్‌గా, మంత్రిగా నేను అందించిన సేవల గురించి వారికి వివరించండి.. నా గెలుపు కోసం ప్రయత్నించండి.. మౌత్‌టాకే నా విజయానికి రామబాణంగా పనిచేస్తుంది' అని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ఎర్రగుంటపల్లి మహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఈశ్వర్ మాట్లాడారు. పార్టీలో నిఖార్సయిన కార్యకర్తలే ఉండాలని, అనుమానాలతో ఉంటే పార్టీకి నష్టం జరుగుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ ఓటమితో పార్టీ కార్యకర్తలకు అధికారుల వద్ద ప్రాధాన్యత లేకుండా పోయిందని, ప్రజల్లో గుర్తింపు లేకుండాపోయిందని ఆవేదన చెందారు. గోదావరి నదిలోంచి 4వేల క్యూసెక్కులు దిగువకు వృథాగా పోతున్నా.. పంపింగ్ చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, నాయకులు పుస్కూరి రామారావు, మిట్ట తిరుపతి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీధర్, అజ్మీర మల్లేశ్‌నాయక్, కనకలక్ష్మి, అపర్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



జాబ్‌మేళా ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్



ఎంపిక పత్రాలు అందిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

మంథని: అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ యువతకు సూచించారు. స్థానిక నృసింహ శివకిరణ్ గార్డెన్స్‌లో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్(టీఎస్– ఎస్‌టీఈపీ) ఆదివారం జాబ్‌మేళా ఏర్పాటు చేసింది. అరుణశ్రీ సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు మెగా జాబ్ మేళా నిర్వహించామన్నారు. మొత్తం 65 కంపెనీలు పాలుపంచుకున్నాయని, ఏడో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హతగల నిరుద్యోగులకు ఇందులో ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. అంతకుముందు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మెగాజాబ్ మేళా ప్రారంభించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంచుకోవాలని యువతకు సూచించారు. ఆంగ్లభాష నేర్చుకుని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని కోరారు. జాబ్‌మేళాలో 1,377 మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 330 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని, 629 మంది అభ్యర్థులు షార్ట్ లిస్టులో ఉన్నారని నిర్వాహకులు వివరించారు. డీవైఎస్‌వో సురేశ్, జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు, మంథని, రామగిరి ఎంపీపీలు కొండ శంకర్, ఆరెల్లి దేవక్క కొమురయ్య, ధ్రువ్ కన్సల్టింగ్ సర్వీసెస్ చైర్మన్ మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు పురస్కారాలు

పెద్దపల్లిరూరల్: మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను ఆదివారం సత్కరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన ఈర్ల శోభారాణి, శ్రీమతి అనాసి, జ్యోతి, బండ రజిత, పురుమల్ల అరుణను సత్కరించి పురస్కారాలు అందజేశారు. అవార్డులు పొందిన ఉద్యోగులను జిల్లాకు చెందిన నాయకులు రవీందర్, రమాకాంత్ తదితరులు అభినందించారు.

నేడు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహాచారి తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన పలు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఐటీఐ పాసైన వారు, అప్రెంటీస్‌షిప్ రానివారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హతగల వారు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని ఉదయం 9గంటల వరకు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోతో హాజరు కావాలని సూచించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, నగర మేయర్ అనిల్‌కుమార్

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. పట్టణ ప్రగతి, డీఎంఎఫ్‌టీ, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు, సీడీపీ నిధులు రూ.6.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. నిధుల కొరతతో సతమతమవుతున్న రామగుండం నియోజకవర్గానికి బకాయిలు చెల్లించేలా చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇంటి పథకం ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ శ్రీకాంత్, నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తాఫా, మారెల్లి రాజిరెడ్డి, కొలిపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

పాలకుర్తి(రామగుండం): దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలను అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వాటిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బసంత్‌నగర్ నుంచి ఈసాలతక్కళ్లపల్లి వరకు రూ.1.60 డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి రాజ్‌ఠాకూర్ పాలకుర్తి చెరువు సమీపంలో భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.15కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీని వాస్, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, నాయకులు దేవనందుల రాజమౌళి, సూర సమ్మ య్య, వాసుదేవరావు, తలారీ శంకర్, నగునూరి రమేశ్, మేర్గు అశోక్, శిలగాని రాజేశం, మేకల నర్సయ్య, మాదాసు శ్రావణ్, రావుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

7వేల మంది విద్యార్థులు.. 45 కేంద్రాలు

- పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- హాల్‌టికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభం



సుల్తానాబాద్‌లోని ఓ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

సుల్తానాబాద్(పెద్దపల్లి) : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 7,728 మంది విద్యార్థులు హాజరవుతారని, వీరికోసం వివిధ ప్రాంతాల్లో 45 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి, పారదర్శక పరీక్షల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చినట్లు అధికారులు వివరించారు.

హాల్‌టికెట్ల జారీ షురూ..

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గత బుధవారం నుంచి హాల్‌టికెట్లు జారీచేస్తున్నారు. వివిధ యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే సమీపంలోని ఆన్‌లైన్ కేంద్రం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఫీజు బకాయిలు, ఇతర ఏమైనా కారణాలతో హాల్‌టికెట్లు ఇవ్వని ప్రైవేట్ యాజమాన్యాలపై తమకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

మూడు నెలలుగా ప్రత్యేక తరగతులు..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిరంతరం ప్రణాళికబద్ధంగా కొనసాగుతోంది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ ఉత్సాహ పరుస్తున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతోపాటు జిల్లా విద్యాధికారి మాధవితో మెరుగైన ఫలితాల సాధనపై ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు.

45 పరీక్ష కేంద్రాలు..

రెగ్యులర్ విద్యార్థుల కోసం జిల్లాలో 45 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 32 ప్రభుత్వ, 13 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 7,728 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. ఇందులో సప్లిమెంటరీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.

45మంది చీఫ్ సూపరింటెండెంట్లు..

45 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 45 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ముగ్గురు కస్టోడియన్లను నియమించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు జిల్లావ్యాప్తంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది.

అందుబాటులో వైద్యసిబ్బంది..

ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త గ్లూకోస్ పౌడర్, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌తో అందుబాటులో ఉంటారు. వీరు అత్యవసర వైద్య సేవలు అందిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. అవసరమైనచోట షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.

భయం వద్దు



పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు భయపడవద్దు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తే విజయం సొంతమవుతుంది. నిర్దేశిత గడువులోగా సిలబస్ పూర్తయ్యింది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అల్పాహారం అందిస్తున్నాం. ఫీజు చెల్లించ లేదనే నెపంతో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– మాధవి, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

● నలుగురికి తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేట శివారులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టగా.. నలుగురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల గంగారాం, చెప్యాల గంగు, దర్శనం శారద, బోయిని ఉమ ఆటోలో శనివారం రాత్రి 10 గంటలకు మండలంలోని చింతకుంట గ్రామానికి వెళ్తున్నారు. భూషణరావుపేట శివారుకు చేరగానే ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల ఆసుపత్రులకు తరలించామని గ్రామస్తులు వివరించారు.

గోదావరి నదిలో మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ సమీప గోదావరి నది శివారులో ఆదివారం పురుషుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు మృతదేహంపై దుస్తులు లేవని, శరీరంపై బొబ్బలు తేలి, కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. మృతుడి మెడలో పూసల దండ, నడుముకు మొలిదారం ఉందని, వయస్సు సుమారు 35–40ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 871265 6527 మొబైల్ నంబరుకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పోలీసుల అదుపులో నాగరాజు..?

కోరుట్ల: కోరుట్ల బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్‌పై కత్తితో దాడి చేసి రూ.20 వేలు వసూలు చేసిన నిందితుడు విత్తనాల నాగరాజును పోలీసులు ఆదివారం అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు నేరాల్లో నిందితుడైన నాగరాజు.. పదిరోజుల క్రితం వెంకటేశ్‌పై దాడి చేసి డబ్బులు తీసుకుని పరారయ్యాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు రెండుబృందాలు ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి వద్ద పోలీసులకు చిక్కినట్లు తెలిసింది.

నేడు జేఎల్ఎంలకు స్తంభం ఎక్కే పరీక్ష

కొత్తపల్లి (కరీంనగర్): ఆరో విడత జూనియర్ లైన్‌మెన్‌ల నియామకానికి టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రకటనలో తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల సర్టి ఫికెట్స్ పరిశీలన, పోలు ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతం వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా కనగర్తి గ్రామ శివారులో పట్టుకొని, విలాసాగర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రహదారుల విస్తరణకు మోక్షం

- ఇరువైపులా 40 మీటర్ల వెడల్పు
- 72 క్వార్టర్లు ఖాళీచేయాలని కార్మికులకు నోటీసులు
- ఉపాధి కోల్పోతామంటున్న చిరువ్యాపారులు



ప్రతిపాదిత రీగల్ షూమార్టు రహదారి

గోదావరిఖని: 'ఖని'వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఇరుకు రోడ్లతో నిత్యం ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. మరో రెండు దశాబ్దాల తర్వాత అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా రహదారులు విస్తరించాలని నిర్ణయించారు. ప్రధానంగా లక్ష్మీనగర్‌లో రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. భాస్కర్‌రావు భవన్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు, చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్ వరకు ఇరువైపులా విస్తరించనున్నారు. పనులు పూర్తయితే.. ప్రధాన రోడ్డు కనీసం వంద అడుగుల వెడల్పు విస్తరించి ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.

72 క్వార్టర్ల ఖాళీకి ఆదేశాలు..

- రోడ్ల విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం తన పరిధిలోని 72 క్వార్టర్లను తొలగించేందుకు సిద్ధమైంది. ఈమేరకు అందులో నివాసం ఉంటున్న కార్మికులను ఖాళీ చేయాలని శనివారం నోటీసులు జారీచేసింది. భాస్కర్‌రావు భవన్ నుంచి చౌరస్తా, చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్‌తోపాటు పోచమ్మగుడి వెనకాల నుంచి ప్రభుత్వ బాలికల కళాశాల వరకు 72 క్వార్టర్లను తొలగించడానికి నిర్ణయించింది. దీనిద్వారా పెద్దగా ఇబ్బంది లేకున్నా.. వాటిని ఆనుకుని ఏర్పాటు చేసుకున్న దుకాణాలు కోల్పోయే అవకాశం ఉంది. అయితే, ప్రజా అవసరాల కోసం ఈనిర్ణయం తీసుకున్నామని, అందరూ సహకరించాలని యాజమాన్యం కోరుతోంది.

తొలగింపు తప్పదా..?

- రహదారుల విస్తరణకు ముందుకొచ్చిన సింగరేణి.. ఇరువైపులా విస్తరిస్తుందా?, ఒక క్వార్టర్ల వైపే వెడల్పు చేస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే వైపు విస్తరిస్తే చాలామంది ఇబ్బంది పడతారని, రోడ్లను ఆక్రమించి ఏర్పాటైన షాపులను వెనక్కి జరిపి ఇరువైపులా విస్తరిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరువైపులా విస్తరించాలి



రోడ్ల విస్తరణను స్వాగతిస్తున్నాం. అయితే, ఒక వైపు కాకుండా ఇరువైపులా విస్తరించాలి. సింగరేణి గుర్తింపు యూనియన్‌తో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోంది. ఒకవైపు విస్తరిస్తే ఊరుకునేదిలేదు.

– రియాజ్‌అహ్మద్, అధ్యక్షుడు, హెచ్ఎంఎస్

ఎమ్మెల్యే ప్రతిపాదించారు



రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రతిపాదనల మేరకు గోదావరిఖనిలో రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టాం. కార్పొరేట్ నుంచి వచ్చిన సూచనలు సలహాలు పాటిస్తున్నాం. ఆర్నెల్లలో పనులు పూర్తిచేస్తాం.

– శ్రీనివాస్, జీఎం, ఆర్జీ–1

ప్రజలు సహకరించాలి



వచ్చే రెండు దశాబ్దాల్లో జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రధాన చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్, భాస్కర్‌రావు భవన్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు 40మీటర్లరోడ్డు విస్తరిస్తాం. రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలి.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే

సహకరిస్తాం



రోడ్ల విస్తరణకు సహకరిస్తాం. విస్తరణ కోసం క్వార్టర్లు తొలగించేందుకు సింగరేణి యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. 30ఏళ్లుగా ఇదే ప్రాంతంలో పూలవ్యాపారం చేస్తున్నాం. షాపుల కోసం ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించాలి. మా బతులకు రోడ్డు పాలు కాకుండా చూడాలి.

– గాజుల లక్ష్మణ్, ఫ్లవర్ మర్చంట్

షాపులు ఏర్పాటు చేయాలి



ఇరువైఏళ్లుగా ఫుట్‌వేర్ వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. రోడ్డు విస్తరణకు సహకరిస్తాం. అయితే మా వ్యాపారానికి ఇబ్బంది లేకుండా షాపులు కేటాయించేలా చూడాలి. మా ఉపాధి దెబ్బతినకుండా తినకుండా చూడాలని ఎమ్మెల్యేను వేడుకుంటున్నాం.

– ఇర్ఫాఖాన్, ఫుట్‌వేర్ వ్యాపారి

రాజన్నకు భక్తుల రద్దీ



వేములవాడ: రాజన్నను ఆదివారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వరుసగా మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో భారీగా తరలివచ్చిన భక్తుల సంఖ్య ఇప్పటికీ తగ్గడం లేదు. ఆదివారం అమావాస్య ఉన్నప్పటికీ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. మహాశివరాత్రి జాతర మహోత్సవాలు ముగిసినప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ద్వితీయస్థానం



ద్వితీయస్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన 45వ రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించింది. ఫైనల్‌లో ఆతిథ్య వరంగల్ జట్టుపై హోరాహోరీగా తలపడి ఓటమి చెంది ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టు విజయం సాధించడంపై హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, ఒలింపిక్ సంఘం బాధ్యులు గసిరెడ్డి జనార్దన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ సురేందర్ హర్షం వ్యక్తం చేశారు.

రెండు గ్రామాల మధ్య ఆలయ వివాదం



ఆందోళన చేస్తున్న చల్‌గల్ గ్రామస్తులు

జగిత్యాలరూరల్: చల్‌గల్, అర్బన్ మండలం హస్నాబాద్ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హస్నాబాద్ పేరు పెట్టడాన్ని నిరసిస్తూ చల్‌గల్ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పురాతన కాలం నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయానికి చల్‌గల్, హస్నాబాద్, చెర్లపల్లె, ఉప్పరపేటకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా హస్నాబాద్ గ్రామస్తులు ఆలయంపై తమ గ్రామం పేరు రాయడంతో ఆలయానికి వెళ్లిన చల్‌గల్ గ్రామస్తులు నిలదీయగా వివాదం మొదలైంది. ఆదివారం చల్‌గల్ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు దేవాలయానికి వచ్చి ఆలయంపై ఉన్న పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణ ఏఎస్సై వేణురావు గ్రామస్తులతో మాట్లాడారు. వారిలో ఒక బృందాన్ని పట్టణ పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారు. హస్నాబాద్ గ్రామస్తులను పట్టణ సీఐ వేణుగోపాల్ పిలిపించి ఇరు వర్గాలతో మాట్లాడారు. ఆలయం వద్ద పేరును తొలగించాలని, ఏ ఉత్సవాలు జరిగినా ఇరు గ్రామాల ప్రజలు కలిసికట్టుగా జనాభా ప్రాతిపాదికన కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహించుకోవాలన్నారు. దీంతో చల్‌గల్ గ్రామస్తులు శాంతించారు. అనంతరం గ్రామస్తులకు దేవాలయం వద్దే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

మార్కెట్‌లోకి ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా



ర్యాక్ ప్రారంభిస్తున్న సీజీఎం సుధీర్‌కుమార్ ఝూ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): దేశీయంగా ఎరువుల ఉత్పత్తి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో సుమారు రూ.6,500 కోట్ల వ్యయంతో రా మగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ క ర్మాగారం నిర్మించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, త మిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకపాత్ర పో షి స్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది. ఈ నేపథ్యంలో రైలుమార్గం ద్వారా 350వ ర్యాక్‌ను ఆదివారం సీజీఎం సుధీర్‌కుమార్ ఝా, ఉన్నతాధికారులు జెండాఊపి ప్రారంభించారు. సుధీర్‌కుమా ర్ ఝా మాట్లాడుతూ దేశంలో వ్యవసాయోత్పత్తిని పెంచడం కోసం రైతులకు సరసమైన ధరలకు తగి నంత యూరియాను సకాలంలో అందిస్తున్నామన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవతో భారతప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఆర్ఎఫ్‌సీఎల్ అని అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి, రవాణాకు స హకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎ రువులు, రసాయనాల శాఖ, భారతీయ రైల్వే, ఇత ర విభాగాల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన ట్రినిఫెస్ట్



కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో ట్రినిఫెస్ట్ పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రినిటి కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

- రంగంలోకి 20 ప్రత్యేక బృందాలు
- నిర్దేశిత లక్ష్య సాధనకు కార్యాచరణ



పన్ను వసూలు చేస్తున్న వెంకటేశ్, శివప్రసాద్

పెద్దపల్లిరూరల్: బల్దియా అధికారులు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వందశాతం వసూలు చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 20 రోజుల్లో ముగియనుండడంతో వసూళ్లను వేగవంతం చేశారు. ఇప్పటికే దాదాపు 70శాతం ఆస్తిపన్ను వసూలు కాగా మిగతా ఆస్తిపన్ను వసూలు చేసి పెద్దపల్లి మున్సిపాలిటీని జిల్లాలో అగ్రభాగాన నిలపాలనే యోచనలో అధికారయంత్రాంగం పనిచేస్తోంది.

ప్రత్యేక బృందాల నియామకం..

- ఆస్తిపన్ను వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.
- ఇంటింటా పర్యటిస్తూ బకాయిల భారం గురించి వివరిస్తూ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు.
- పట్టణ అభివృద్ధి కోసం సకాలంలో పన్ను చెల్లించాలంటూ వివరిస్తున్నారు. పన్ను బకాయి ఉంటే దానిపై వడ్డీ భారం పడుతుందని, అలా కాకుండా సకాలంలో చెల్లించి సహకరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ బకాయిలే అధికం..

- ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు అధికంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన సుమారు రూ.1,40,23,000 వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.1.98లక్షలే వసూలయ్యాయి. అలాగే కేంద్రప్రభుత్వ ఆస్తులకు సంబంధించి రూ.23.06లక్షలు వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.1.04లక్షలే వసూలయ్యాయి. ప్రభుత్వం చొరవ చూపితే తప్ప బకాయిలు వసూలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రైవేటుకు చెందిన ఆస్తిపన్ను దాదాపు వసూలవుతోంది.

ప్రజలు సహకరించాలి

ఇళ్ల యజమానులు అందరూ సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. జనవరి నుంచి మార్చి ఆఖరు రోజుల్లోనే ఎక్కువగా పన్ను చెల్లిస్తున్నారు. అలా కాకుండా ముందస్తుగా చెల్లించిన వారికి ప్రభుత్వం ఏప్రిల్ నెలలో ఎర్లీబర్డ్ పథకం కింద 5శాతం రాయితీ వర్తింపజేస్తుంది. ఈ పథకం కింద చెల్లించి ఆదా చేసుకోవడం మేలు. అలాగే బకాయిదారుల కోసం ఇప్పుడు వడ్డీలో 90శాతం రాయితీ కల్పించింది. ఒకేసారి బకాయి మొత్తాన్ని చెల్లించి వడ్డీరాయితీ పొందొచ్చు. ఈ నెలాఖరుకల్లా నూరుశాతం ఆస్తిపన్ను వసూలు చేస్తాం.

– వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

పెద్దపల్లిలో 9,965 నివాసాలు..

- పెద్దపల్లి పట్టణంలో సుమారు 9,965 నివాసాలకు సంబంధించి రూ.2,58,21,000 వసూలు కావాల్సి ఉండగా రూ.1,66,81,000 వసూలయ్యాయి.
- కమర్షియల్‌కు సంబంధించిన 636 మంది నుంచి రూ.1,25,97,000 వసూలు కావాల్సి ఉండగా రూ.72,85,000 వసూలయ్యాయి.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు



బాధితులను పరామర్శిస్తున్న ఆది శ్రీనివాస్

- నలుగురికి గాయాలు
- బోరుమోటార్ దించుతుండగా సంఘటన
- బావుసాయిపేటలో విషాదం



పంబాల భూమయ్య మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): వ్యవసాయ మోటార్‌ను దించుతుండగా విద్యుత్‌తీగలు తగిలి షాక్ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కోనరావుపేట మండలం బావుసాయిపేటలో విషాదం నింపింది. బావుసాయిపేటకు చెందిన తిక్కల భూమయ్య బోరుబావిలోని మోటార్ కాలిపోయింది. దాన్ని బాగు చేయించి ఆదివారం పంబాల రాజు, కర్నాల మహేశ్, తుపాకుల శ్రీనివాస్, పంబాల భూమయ్యలతో కలిసి బోరుబావిలో మోటార్‌ను దించుతున్నారు. ఈక్రమంలో విద్యుత్ మెయిన్‌లైన్లు ఇనుప పైపులకు తగలడంతో నలుగురు షాక్‌కు గురయ్యారు. గమనించిన తోటి రైతులు నలుగురిని వెంటనే వేములవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పంబాల భూమయ్య మృతిచెందాడు. బాధితులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బైరగోని నందూగౌడ్ పరామర్శించారు. మృతునికి భార్య అనిత, కూతురు గౌతమి, కుమారుడు రేశ్వంత్ ఉన్నారు. కోనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బేస్‌బాల్ కేరాఫ్ కరీంనగర్

● తెలంగాణ బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల హరిశంకర్





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చల్ల హరిశంకర్, శ్వేత, పోటీల్లో క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: బేస్‌బాల్ క్రీడకు కంచుకోట, కేరాఫ్ కరీంనగర్ జిల్లా అని తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. రాష్ట్ర బేస్‌బాల్, కరీంనగర్ జిల్లా బేస్‌బాల్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన 31వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంజాబ్‌లో జాతీయ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు జాతీయ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించాలన్నారు. బేస్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత మాట్లాడుతూ, ఈ నెల 22 నుంచి 25 వరకు పంజాబ్‌లోని సంగూర్‌లో జాతీయస్థాయి జూనియర్స్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు సముచిత స్థానం కల్పించి నిధులు విడుదల చేయాలన్నారు. జిల్లా బేస్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిష్‌పాష మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు సుమారు 20 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు.



'అల్ఫోర్స్ టైనీటాట్స్' వార్షికోత్సవ వేడుకలు

కొత్తపల్లి(కరీంనగర్): నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి కళల పట్ల అవగాహన ఉండడమే కాకుండా, అందులో పాల్గొనేందుకు ఆసక్తితో ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్స్ మైదానంలో మౌక్తికం పేరుతో నిర్వహించిన అల్ఫోర్స్ టైనీటాట్స్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, నేటి ప్రపంచంలో మార్పులు చాలా త్వరగా చోటు చేసుకుంటున్నాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని అగ్రగామిగా ఉండాలన్నారు. విద్యార్థులు సృజనాత్మకతతో ముందుకు పయనించి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని త్వరగా సాధించి గొప్పగా వ్యవహరించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.